## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 05-09-2015 జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

కొందరి జీవితాలు సమానంగా ఉంటాయి, హెచ్చుతగ్గులు ఏమీ కనబడవు అంటే పుట్టినది మొదలు మరణించేవరకు వారి జీవితాలు సుఖంగా సాగిపోతాయి. కాని కొందరి జీవితాలు మధురంగా ప్రారంభమయి చివరకు విషాదంతో ముగుస్తాయి. ఈ ప్రపంచమే మనకు ఒక పాఠశాల. ఈ ప్రపంచంలో ఉన్న రకరకాల జీవితాలను మనం స్టడీ చేస్తూ ఉంటే పుస్తకాలలో చదివిన దానికంటే మనం ఎక్కువ నేర్చుకోవచ్చును. జీవితంలో ఎప్పుడు కలుసుకొన్నామో మరల ఎప్పుడు విడిపోతామో మనకు తెలియదు. అన్ని జీవితాలు అంతే కాని జీవితంలో కలుసుకోవటం ఎప్పుడయితే ప్రారంభమయ్యిందో అప్పుడే విడిపోవటం కూడా ప్రారంభమవుతుంది. జీవితంలో కొంతమందికి అబ్జర్వేషన్ ఉంటుంది. అందరూ అబ్జర్వేషన్ నేర్చుకోవాలి. భగవాన్ దగ్గరకు ఎవరయినా వచ్చినప్పుడు ఆయన వారితో ఏమీ మాట్లాడకపోయినా, అలా చూడటం వలన వారి గురించి అంతా ఆయనకు తెలిసేది. వారి జీవితాలను ఎక్కడ మలుపు తిప్పాలి, ఎప్పుడు మలుపు తిప్పాలి అని అంతర్యామిగా ఉండి పరిశీలించేవారు. రామకృష్ణుడు ఏమనేవాడు అంటే ఒకసారి యిక్కడకు వచ్చి శరణాగతి చేసాక మీ బాధ్యత తీరిపోయింది, ఇంక నాదే బాధ్యత అనేవారు. ప్రతీరోజూ వారి జీవితం అబ్జర్వ్ చేసేవారు. మీరు ఇలా ఉండాలి, అలా ఉండాలి అని రామకృష్ణుడు వారితో చెప్పేవారు. భగవాన్ మటుకు ఎప్పుడూ అలా చెప్పేవారు కాదు కాని గైడెన్స్ సైలెంట్‌గా లోపల నుండి వచ్చేది అంటే లోపల నుండే మారుమనస్సును కలుగజేసేవారు.

కంచిపరమాచార్య సామాన్యకుటుంబంలోనే పుట్టారు. ఆయనకు 14వ సంవత్సరంలో సన్యాసం యిచ్చారు. అప్పటినుండి ఆయన కష్టపడి చదువుకొని పెద్ద పండితుడు అవ్వటమే కాదు, గొప్ప తపస్సు చేసి ప్రపంచానికి ఆచార్యుడు అయ్యాడు. గురువులు ఆయన దగ్గరకే వచ్చి పాఠాలు చెప్పేవారు. వారు పాఠాలు చెప్పి వెళ్ళిపోయేటప్పుడు ఆయనతో ఒకమాట చెప్పేవారు. నువ్వు అందరి పిల్లలు లాగ ఉండకూడదు. నువ్వు పీఠాధిపతి అవుతున్నావు. మా పాఠాలు విని, నేర్చుకొని నువ్వు పండితుడవు అవుతున్నావు. కాని ఆచరణ లోకం అంతా చూస్తూ ఉంటుంది. మామూలు మనిషి ఏదయినా తప్పుచేసినా ఫరవాలేదు. నువ్వు ఏదయినా

పొరపాటు చేస్తే కోట్లమంది చూస్తారు. అందుచేత మామూలు మనుషులు అజాగ్రత్తగా ఉన్నా, మీరు బాధ్యతగల వ్యక్తులు, పీఠాధిపతులు అవుతున్నారు కాబట్టి మేము మీకు పాఠాలు చెపుతున్నప్పటికీ నువ్వు మాలాగ ఉండకూడదు, నువ్వు ప్రత్యేకంగా నీ ఆచరణలో పెర్‌ఫెక్టుగా ఉండాలి అని చెప్పి విడిచిపెట్టేవారు. యివన్నీ ఆయన మనస్సులో పెట్టుకొన్నారు. జీవితం అంతా అన్నం తినకుండా అటుకులు అవి తిని బతికారు. రుచికోసం ఆయన జీవితంలో ఏదీ తినలేదు. ఆహారం విషయంలో మన పూర్వపు ఋషులు కూడా అలా ఉండలేదేమో అనిపిస్తుంది.

మనం మనస్సును ఎందుకు జయించలేకపోతున్నాము అంటే మనం తెల్లవారు ఝామున లేస్తున్నాము, స్నానం చేసి జపం చేస్తున్నాము, ధ్యానం చేస్తున్నాము, అరుణాచలం వెళ్ళి గిరిప్రదక్షిణ చేసి వస్తున్నాము, కాశీవెళ్ళి గంగానదిలో స్నానం చేసివస్తున్నాము, మీరు చేసేవన్నీ నిజమేకాని మనలోపల జీవితం చూసుకొంటే అన్నీ కోరికలే. లోపల కోరికలు ఉన్నప్పుడు మీరు జపం చేసినా, ధ్యానం చేసినా మీకు జ్ఞానం కలుగదు. ఎందుచేతనంటే లోపల కోరికలు ఎక్కువగా ఉన్నప్పుడు జపం చేసినా, ధ్యానం చేసినా మీ మనస్సు నిలబడదు, మీకు తెలియకుండానే మీ మనస్సు ఆ కోరికలకూడా వెళ్ళిపోతుంది. అందుచేత కోరికలు తగ్గించుకొన్నాక మీరు ధ్యానంలో సక్సెస్ అవుతారు కాని మీలో కోరికలు ఉన్నప్పుడు నెమ్మదిగా మీ మనస్సు అక్కడకు వెళ్ళిపోతుంది, అంటే మీ కోరిక తీసుకొనిపోతుంది. మనం సాధన చేసి తరించాలి, మనం మోక్షం సంపాదించాలి అనేటటువంటి పట్టుదల మనలో లేదు. ఏదో సత్సంగాలకు వెళుతున్నాము, అన్ని వింటున్నాము. కాని మనం మోక్షాన్ని సంపాదించాలి, మనం పొందవలసింది అదే అంతకు మించి యింకోటి ఏమీ లేదు, యిదే మన జీవితధ్యేయం అనే స్థిరమైన నిశ్చయం మనకు లేదు. ఏదో మనకు ఉన్న వేలాది కోరికలలో అదికూడా ఒక చిన్న కోరిక అంతే.

మనస్సు జపం చెయ్యమంటే చేస్తోంది కాని జపం చేస్తుండగానే కోరిక కూడా అలా వెళ్ళిపోతోంది అని పరమాచార్యుడి జీవితంలో ఇది గ్రహించాడు. అసలు మనస్సు ఎక్కడికి పరిగెడుతోంది, దేని గురించి పరిగెడుతోంది, ఎక్కడో ఏదో ఉంది, ఎక్కడో ఏదో ఉంది అంటే మనస్సు వెళ్ళిపోతుంది. ఏముందీ ఈ సృష్టిలో, ఎక్కడా ఏమీ లేదు అనే భావన ఆయనకు స్థిరపడేవరకూ మనస్సు ఆగలేదు. నీచేత చూడబడేది చూసేది, నీచేత ఆలోచింపబడేది

ఆలోచించేది అన్నీ అసత్యం. నువ్వు ఏ విషయం గురించి ఆలోచిస్తున్నావో, ఇది ఎంత అసత్యమో, ఆలోచించేది కూడా అంతే అసత్యం. నీచేత చూడబడేది కూడా ఏదీ నిజంకాదు, ఊరికే నీకు నిజంలాగ కనిపిస్తోంది కాబట్టి మనం దాని కూడా వెళ్ళిపోతున్నాము. లోపలఉన్న సద్వస్తువు అది ఒక్కటి మాత్రమే సత్యం. ఇప్పుడు మనకు దేహం, ఇంద్రియాలు ఎలా ఎరుకలో ఉన్నాయో అలాగ లోపల ఉన్న సద్వస్తువు నీకు ఎరుకలోనికి వచ్చేవరకు ఈ జనన మరణ ప్రవాహం ఆగదు. మీరు పొందవలసింది మీ హృదయంలోనే ఉంది, దానిని పొందకుండా అడ్డువచ్చేవి కూడా మీ లోపలే ఉన్నాయి. మనిషి పతనమవ్వటానికి బయట అనేక ఆకర్షణలు ఉన్నాయి. అన్ని ఇంద్రియాలకు లోకంలో ఆకర్షణలు ఉన్నాయి. ఈ ఆకర్షణలు, కోరికలు మీ మనస్సును బయటకు తీసుకొనిపోతున్నాయి. చివరకు ఏమి జరుగుతోంది అంటే ఈ ఆకర్షణలకు లొంగిపోయి నీ మనస్సు బాహ్యముఖమవ్వటం వలన లోపలఉన్న స్వర్గాన్ని, లోపలఉన్న సత్యాన్ని నీ చేతులతో నువ్వే పోగొట్టుకొంటున్నావు. నీ మనస్సు చలిస్తూ ఉంటే ఎక్కడో ఏదో ఆకర్షణ ఉంది. బయట ఏరకమైన ఆకర్షణ నీకు లేకపోతే అసలు నీ మనస్సు చలించదు. వీటిలో నుండి నువ్వు బయటకు వచ్చినప్పుడు నీలోపల ఉన్న సద్వస్తువు నీకు ఎరుకలోనికి వస్తుంది. అప్పుడు నీకు శరీరం ఉండటం వలన లాభంలేదు, శరీరం పోవటం వలన నష్టంలేదు అని నీకు తెలుస్తుంది. అసలు మనకు ఏ రకమైన వాంఛ లేదు అనుకోండి, ఇంక మనకు శరీరంతో పని ఏముంది? మనం ప్రతీ విషయం ఎంతోకొంత స్వతంత్రంగా ఆలోచించటం నేర్చుకోవాలి. మనం ఏదైతే లక్ష్యంగా పెట్టుకొన్నామో అక్కడ మన విశ్వాసం స్థిరపడాలి. అప్పుడు మన మనస్సు దానంతట అదే అణిగిపోతుంది.

చాలామంది మంచివారిని ఈలోకం అపార్థం చేసుకొంది. వారి యొక్క మంచి తనాన్ని లోకం భరించలేకపోయింది. లోకం అంత మంచిదికాదు. ఏసుక్రీస్తుకు శిలువ వేసినా, సోక్రటీసును విషం పెట్టి చంపినా, గాంధీని కాల్చి చంపేసినా వాళ్ళందరి జీవితాలు విషాదాంతం అయిపోయినాయి అంటే వారి మంచితనాన్ని లోకం భరించలేక వారిని నానా హింసలకు గురిచేసింది. వాళ్ళందరు సమాజాన్ని ప్రశాంతంగా ఫేస్ చేసారు. సోక్రటీసును జైలులో విషం పెట్టి చంపారు. రేపు విషం పెట్టి చంపుతారు అనగా ఆరాత్రి ఆయన భక్తులు కొంతమంది వచ్చి తాళాలు పగలుకొట్టి బయటకు వెళ్ళిపోదాము, వచ్చేయండి అన్నారు.

సోక్రటీసు ఏమన్నాడు అంటే ఎందుకు అలా పారిపోవటం? ఏదో రోజున చనిపోవాలి కదా! మనిషికి ఏదో రోజున ఈ దేహంనుండి విడిపోవటం తప్పదు. నాకు టైము అయిపోయింది కాబట్టి నేను వెళ్ళిపోతాను. మీరు ఇంకా కొంతకాలం ఈ భూమి మీద ఉండాలి అందుచేత మీరు ఇక్కడనుండి వెళ్ళిపోండి అని చెప్పాడు. మరుసటిరోజున ఆయనకు విషం పెట్టారు. ఆయన మామూలుగా పాయసం తాగినట్లు విషాన్ని తాగేసాడు. ఆ నిగ్రహశక్తి అటువంటిది. ఈ శరీరం ఉండటానికి, పోవటానికి వాళ్ళకేమీ తేడాలేదు. ఇప్పుడు మనం ఉన్నాము కదా అలాగే ఈ శరీరం పోయిన తరువాత కూడా మనం ఉంటాము, పైగా ఈ శరీరానికి సంబంధించిన బరువు ఇంక మోయనక్కరలేదు.

మనకు మనస్సు ఎందుకు అంతర్ముఖం అవ్వటంలేదు? ఏదో కంగారుపడి కళ్ళు మూసుకుని ధ్యానాలు చేసేయకండి. సబ్జక్టు వినండి. అసలు ఏ కారణం వలన నీ మనస్సు అంతర్ముఖం అవ్వటంలేదు? మనస్సు అంతర్ముఖం అవ్వకుండా నీకు ఏది అడ్డువస్తోంది? ఆ కారణం తెగేవరకు మనస్సు అంతర్ముఖం అవ్వదు. సాధన యొక్క రహస్యం ఏమిటి అంటే హృదయం ఎంతవరకు ఖాళీ అయ్యింది? వాడు పండితుడు అయినా, యోగి అయినా హృదయం ఖాళీ అవ్వకుండా వాడికి జ్ఞానం వచ్చే అవకాశం లేదు. అక్కడ స్త్రీ, పురుష భేదం ఏమీ లేదు? ఎవరికైనా హృదయం ఖాళీ అవ్వటం ముఖ్యం. బ్రహ్మచర్యం గురించి భగవాన్ ఏమని చెప్పారు అంటే నువ్వు శరీరం అనుకొన్నప్పుడు ఎదుటివారు కూడా శరీరం అనుకొంటావు, నేను పురుషుడిని అనుకొన్నప్పుడు కొంతమంది స్త్రీలకింద కనిపిస్తారు. పురుషులు అని, స్త్రీలు అని సెక్స్ తేడా ఎక్కడ ఉంది? శరీరంలో ఉంది. లోపల చైతన్యంలో సెక్స్ లేదు. నువ్వు వివాహం చేసుకోకుండా ఉన్నా, నీలో శరీరబుద్ధి ఉన్నంతకాలం సెక్స్‌భావనలో నుండి బయటకు వచ్చావు అని చెప్పటానికి అవకాశం లేదు. కామినీకాంచనాలను జయించమని రామకృష్ణుడు పదేపదే చెపుతూ ఉండేవారు. భగవాన్ ఇక్కడ క్లూ చెపుతున్నారు. శారీరకంగా నువ్వు పెళ్ళి చేసుకోకపోవచ్చు కాని ఆ తలంపులు నిన్ను వెంటాడతాయి. ఇప్పుడు నువ్వు పురుషుడిని అనుకొంటున్నావు. చైతన్యంలో సెక్స్ లేదు. నువ్వు చైతన్యంలో స్థిరపడినప్పుడు అసలు సెక్స్‌భావన నీకు రానే రాదు. సెక్స్‌భావన వచ్చింది అంటే నీకు శరీరభావన ఉన్నట్లే అని చెప్పారు. గాంధీగారు బాహ్యంగా బ్రహ్మచారిగానే ఉన్నారు. అయితే నేను కామాన్ని జయించాను అని

చెప్పలేను అన్నారు. ఎందుచేతనంటే ఆయన పురుషుడిని అని ఆయనకు తెలుస్తోంది కదా! అటువంటప్పుడు సెక్స్‌భావన ఎలా పోతుంది. నువ్వు వివాహం మానేసినంతమాత్రంచేత సెక్స్‌ని ఓవర్‌కమ్ చేయలేవు. దేహభావన పోతే నీకు సెక్స్‌భావన పోతుంది. వివాహం గొడవకాదు, నీలో దేహభావన పోయిందా? అది ముందు నువ్వు చూసుకోవలసింది. స్త్రీ, పురుష బేధం కేవలం దేహానికే. ఆ వలయాన్ని దాటి వెళితే అసలు సెక్స్ అనేది లేదు. గాఢనిద్రలో సెక్స్ ఎక్కడ ఉంది? పెళ్ళి చేసుకొన్నారా, చేసుకోలేదా ఇవన్నీ బాహ్యవిషయాలు. నీకు దేహభావన పోవాలి. దేహబుద్ధి నశిస్తేగాని చైతన్యం తాలుక ఎరుక నీకు కలుగదు. నిరంతరం ఆత్మని చింతించటం వలన, నిరంతరం మనస్సు హృదయంలో నిలబడి ఉండటం వలన నీకు దేహభావన పోయి, చైతన్య భావన కలుగుతుంది. చైతన్యభావన కలిగేవరకు సెక్స్ నిన్ను విడిచిపెట్టదు. నువ్వు పెళ్ళి మానేసినా, నీకు మనస్సులో ఆ చింతన కనుక ఉంటే నీకు ఆధ్యాత్మిక పురోగతి లేదు. అంటే నీకు మానసికవ్యాపారం ఉండకూడదు. నువ్వు బ్రహ్మభావన పెంచుకొంటే బ్రహ్మంలో స్థిరపడతావు. పెళ్ళి చేసుకోకుండా ఉన్నంతమాత్రంచేత నువ్వు బ్రహ్మచారివి కాదు, బ్రహ్మభావన పెంచుకొంటే నువ్వు బ్రహ్మచారివి అవుతావు, అప్పడు సెక్స్‌భావనను అతిక్రమించగలవు, అప్పడు ద్వైతం పోతుంది, మోక్షం వాడిని వరిస్తుంది. నీకు ఇష్టం లేకపోతే పెళ్ళి మానెయ్యి, అంతమాత్రం చేత నువ్వు బ్రహ్మం అయిపోవు అనిభగవాన్ చెప్పారు. భగవాన్ చెప్పిన మాటలు కొంతమందికి నచ్చవు అంటే కొంత కఠినంగా ఉంటాయి. మిమ్మల్ని సంతోషపెట్టటానికికాని, జనాన్ని పోగుచేసుకోవటానికిగాని ఆయన ఎప్పడూ మాటలు చెప్పలేదు. ఈ లోకానికి సంబంధించిన ఆకర్షణలు ఏమీ ఆయనకు లేవు. అసలు సృష్టే లేనివాడికి ఇంక బలహీనతలు ఏమిటి? ఆయన చెప్పిన మాటలలో ఒక్కటీ అసత్యంలేదు. ఆయన మాటలు మనకు అర్థం కాకపోతే వదిలేయాలి. ఇంకో వంద సంవత్సరాల తరువాత వచ్చిన వారికి అయినా ఆ మాటలు అర్థమవుతాయి.

ఉన్నది నలుబది సద్విద్యలో జగత్తు, జీవుడు, ఈశ్వరుడు మనోకల్పితములు అని చెప్పాడు. అది నూటికి నూరుపాళ్ళుసత్యం. ఆ ఒక్క వాక్యం కోసం ద్వైతులందరూ ఆయనను తిడతారు అంటే ఆ మాట మనం భరించలేము. సిరీస్ సుబ్బరాజుగారు ఒకసారి నాతో అన్నారు ఏమండీ జగత్తు అసత్యం అవ్వవచ్చు, జీవుడు అసత్యం అవ్వవచ్చు, ఈశ్వరుడు ఎలా

అసత్యం అవుతాడు. భగవాన్ చెప్పిన మాటలు ఆయనకు నచ్చలేదు. మీకు ఈశ్వరభావన ఎప్పుడు వస్తోంది? మెలకువ వచ్చాక వస్తోంది అంటే జీవభావన, జగత్తుభావనవచ్చిన తరువాత ఈశ్వరభావన వస్తోంది. జగత్తుభావన, జీవభావన రాకుండా మీకు ఈశ్వరభావనరాదు. నీకు జీవభావన కలిగాకే ఈశ్వరభావన వస్తుంది. నీకు జగత్తు కనిపిస్తూ ఉంటే ఈశ్వరుడు ఒకడు ఉన్నాడని గుర్తు వస్తుంది. నీకు జగత్తుభావన లేదు అనుకో, జీవ భావన లేదు అనుకో. ఈశ్వరుడికి సంబంధించిన తలంపే అసలురాదు. గాఢనిద్రలో నీకు మూడూలేవు. నువ్వు నిద్రలోనుండి మెలకువలోనికి రాగానే మొదట నేను అనే తలంపు వస్తుంది, అప్పుడు దేహం స్ఫురిస్తుంది. ఆ వెంటనే జీవనభావన వస్తుంది, జీవభావన తరువాత లోకభావన వస్తుంది, తరువాత ఈశ్వరుడు వస్తాడు. తరువాత మీ పూజలు మీ పద్ధతిలో మీరు చేసుకొంటారు. అహంభావన ఉన్నంతసేపు జగత్తు, జీవుడు, ఈశ్వరుడు ఈ మూడూ నిజమే. నేను ఫలనావ్యక్తిని అని నీకు వ్యక్తిభావన ఉన్నంతసేపు ఈ మూడూ నిజమే. నీకు దేహభావన పోయినప్పడు జీవుడు లేడు, జగత్తులేదు, ఈశ్వరుడు లేడు అది అనుభవంలోనికి వస్తుంది. ఈ వాక్యాన్ని మొయ్యలేక ద్వైతులు ఇది అసత్యం అంటారు. ఈ వాక్యం మొయ్యటం చాలాకష్టం. ఇది చాలా పేచీలకు కారణం అయ్యింది. ఎన్ని పేచీలు వచ్చినా ఆయన ఏమీ పట్టించుకోరు. ఆయన చెప్పిన మాటలు మీకు అర్థం కాకపోతే వదిలేయండి. మీకు అర్థం కాలేదని ఆయన చెప్పింది అంతా తప్పఅని మటుకు మీరు ఎప్పడూ అనుకోవద్దు. ఈ మాటలు చాలామందికి అర్థంకాదు. చాలామంది పండితులకు రమణసాహిత్యం నచ్చదు. ఎందుచేతనంటే అందులో పెద్దగా పాండిత్యం ఏమీ ఉండదు. డైరెక్టుగా పాయింట్ చెపుతారు.

ఈ రోజు కృష్ణాష్టమి. దీనికి గోకులాష్టమి, జన్మాష్టమి అని ఇలా చాలా పేర్లు ఉన్నాయి. హిందువులు ఎక్కువగా కృష్ణుడిని, రాముడిని ఆరాధిస్తారు. కృష్ణుడు అనేక మహత్తరమైన పనులు చేసాడు. ఆయన యుద్ధాలు చేసాడు, రాజ్యాలను పరిపాలించాడు, ఆవులు కాసాడు అన్ని పనులు చేసాడు. ఆయనే అన్నం వడ్డిస్తాడు, అందరూ తిన్న ఆకులు తీసేస్తాడు. ఈ పని గొప్పది, ఆపని చిన్నది అనే బేధం కృష్ణపరమాత్మకు లేదు. కృష్ణుడి పద్ధతి అమెరికాలో ఉంది. అమెరికావాళ్ళు ఆపనీ, ఈపనీ అనిలేదు, అన్ని పనులు చేసుకొంటారు. అందుకే అమెరికా బాగుపడింది. ఇక్కడ మనకు పని బేధంఉంది. రాముడు పూర్ణఅవతారం

అయితే కృష్ణుడు పరిపూర్ణఅవతారం. కృష్ణపరమాత్మ చెప్పిన శాస్త్రం భగవద్గీత. ఆయన చెప్పి సుమారు 5600 సంవత్సరాలు అయినా ఇప్పటికీ కొత్తగా ఉంది. యిప్పుడు భగవద్గీతను ఇతర దేశాలలో కూడా చదువుతున్నారు. భగవాన్ స్కంధాశ్రమం, విరూపాక్షగుహలో ఉండగా భక్తులు వచ్చి తిరిగి వెళ్ళేటప్పుడు ఎవరికయినా బూట్లు సరిగా పట్టటంలేదు అనుకోండి, భగవాన్ వారి దగ్గరకు వెళ్ళి వాళ్ళ కాళ్ళు పట్టుకొని బూట్లు పట్టించేవారు. వారు వద్దండి, వద్దండి అనేవారు, అయినా అటువంటి పనులు కూడా చేసారు. మరి నేను మహర్షిని అనుకొంటే వాళ్ళ కాళ్ళు ముట్టుకోగలరా. ఆయనకు ప్రపంచంలో అంతపేరు వచ్చినప్పటికీ, లోకం చేత పూజింపబడుతున్నప్పటికీ ఎక్కడా గర్వంలేదు, ఆ సమస్యే ఉండదు. ఆయన ఈ ప్రకృతిని దాటిపోయారు. ప్రకృతిగుణాలను దాటిపోయాక ఇది ఎక్కువ అనీ, తక్కువ అనీ లేకపోతే వారు ఏమనుకొంటారు, వీరు ఏమనుకొంటారు అని ఇటువంటి గొడవలు ఏమీ ఉండవు. మీరు ఏమయినా అనుకొంటున్నారేమో అని అనుకోవటానికి ఆయన దృష్టిలో మీరు లేరు, అంతా తానే, వారు తానుగా ఉంటారు కాని నేనుగా ఉండరు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 06-09-2015 జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు హైదరాబాద్ లక్ష్మి జయంతి. లక్ష్మి హైదరాబాద్‌లో భగవాన్ వర్కు కొంత చేసింది. వాళ్ళ బంధువుల ఇంటికి వెళ్ళినా, స్నేహితుల ఇంటికి వెళ్ళినా ఎక్కడికి వెళ్ళినా భగవాన్ గురించి తనకు తెలిసింది చెపుతూ ఉండేది. హైదరాబాద్‌లో చాలా కుటుంబాలలో భగవాన్‌ను పరిచయం చేసింది. మాకు లక్ష్మిద్వారానే భగవాన్ గురించి తెలిసింది అని చాలామంది భక్తులు చెప్పేవారు. లక్ష్మికి ఇక్కడ మనం జయంతి చేస్తున్నాము అంటే లక్ష్మి భగవాన్‌కు సంబంధించినపని చాలా చేసింది, చేసిన పని మనం కాదనకూడదు, చేసినమంచిని మనం కాదనకూడదు. హైదరాబాద్‌లో రమణకేంద్రం ఉన్నప్పటికి వారికంటే ఎక్కువగా లక్ష్మే భగవాన్‌ను పరిచయం చేసింది అనిపిస్తుంది. ఎవరు ఏ మార్గంలో ఉన్నా లక్ష్మి రమణమార్గం తప్పలేదు, భగవాన్ పట్ల విశ్వాసం ఎప్పుడూ చలించలేదు. భగవాన్ సబ్జక్టు అంటే లక్ష్మికి బాగా ఇష్టం. లక్ష్మివాళ్ళు కొంతకాలం మధురానగర్‌లో ఉండేవారు. అప్పడు చాలామంది భక్తులు వస్తూ ఉండేవారు. అలా ఎక్కువమంది భక్తులు రావాలనే లక్ష్మి కూడా కోరుకొనేది. లక్ష్మి భగవాన్